ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 23 జూన్ 2024




బోడకాకరకాయ @ రూ.400



మంథని, జూన్ 22: పేరుకే బోడ.. కూరగాయల్లో మాత్రం ఖరీదైనదిగా విరాజిల్లుతోంది.. బోడకాకరకాయ. ఈసీజన్‌లో తొలిసారిగా వచ్చిన బోడకాకరకాయలను కిలోకు రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. మంథని కూరగాయల మార్కెట్‌లో రెండు రోజులుగా బోడకాకరకాయలను అత్యధిక ధరకు విక్రయిస్తున్నప్పటికీ జనం కొనుగోలు చేస్తూనే ఉన్నారు. మార్కెట్‌లో కిలో చికెన్ ధరకంటే అధిక ధర ఉన్నా డిమాండ్ మాత్రం కొనసాగుతోంది. మంథని నియోజకవర్గ అడవుల్లో సహజ సిద్ధంగా లభించే బోడ కాకరకాయలతో వండిన పులుసు, వేపుడు కూరలు భలే రుచిగా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి దాదాపు రెండు నెలల పాటు మాత్రమే లభించే ఈ బోడ కాకరకాయలను ధర కాస్త ఎక్కువైనా సరే రుచిచూడాల్సిందేనంటున్నారు ఈ ప్రాంత భోజన ప్రియులు.. మంథని నియోజకవర్గంలోని మహాముత్తారం మండలం సింగారం, బోర్లగూడెం, కనుకునూరు, రెడ్డిపల్లి, మహదేవపూర్ మండలం పంకెన, పల్మెల, ఎల్లంపల్లి, ముకునూర్, కాటారం మండలం వీరాపూర్, జాదరావుపేట, గుండ్రాత్‌పల్లి, చిద్నెపల్లి అటవీ ప్రాంతాల్లో ఈ సీజన్‌లో బోడకాకరకాయలు విరివిరిగా లభిస్తాయి. వీటిని స్థానికులు, గిరిజనులు సేకరిస్తుంటారు. మహదేవపూర్, కాటారం, మంథని, భూపాలపల్లి, గోదావరిఖనిలాంటి పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ధర అధికంగా ఉన్నప్పటికీ మార్కెట్‌లోకి కాయలు ఎక్కువగా వస్తే కిలోకు రూ.150 నుంచి 200 వరకు ధర తగ్గే అవకాశం ఉంది.

- ఆగస్టు 15లోపు రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు
- జిల్లాలో రూ.800 కోట్ల నుంచి వెయ్యి కోట్ల వరకు మాఫీ అయ్యే అవకాశం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఒకేసారి 2 లక్షల రూపాయల వరకు రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ఆ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. పంట రుణాల మాఫీ, రైతు భరోసా పథకాల గురించి శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఒకేసారి రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకున్నది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు కటాఫ్ తేదీగా నిర్ణయించింది. ఈ మధ్య కాలంలో రైతులు తీసుకున్న పంట రుణాలను వడ్డీతో లెక్కించి 2 లక్షల రూపాయల వరకు మాఫీ చేయనున్నారు. ఆ పైన ఉన్న మొత్తాలను రైతులు బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో 800 కోట్ల నుంచి వెయ్యి కోట్ల రూపాయల వరకు మాఫీ అయ్యే అవకాశాలున్నాయి. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం సుమారు 1600 కోట్ల రూపాయల వరకు పంట రుణాలను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఆ మేరకు బ్యాంకర్లు 800 కోట్ల రూపాయలకు మించి ఇవ్వలేదు. గతంలో తీసుకున్న పంట రుణాలను సంబంధిత రైతులు రీషెడ్యూల్ చేసుకోకపోవడం వల్ల లక్ష్యం మేరకు రుణాలను బ్యాంకు అధికారులు ఇవ్వలేదు. గత ఏడాదికి ముందు నాలుగేళ్లలో బ్యాంకులకు చెల్లించని రుణాలు 200 కోట్ల రూపాయలలోపే ఉంటాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం కటాఫ్ తేదీని మాత్రమే ప్రకటించింది కానీ, మార్గదర్శకాలను ప్రకటించలేదు. మార్గదర్శకాలు విడుదల చేస్తే కొందరి రుణాలు మాఫీ కాకపోవచ్చని తెలుస్తున్నది. 800 కోట్ల పంట రుణాల్లో ఒక 5 శాతం వరకు 2 లక్షలకు పైగా పంట రుణాలు తీసుకున్న రైతులు లేకపోలేదు. ఒక రైతు ఒకే భూమిపై వేర్వేరు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లయితే ఎక్కువ మొత్తంలో తీసుకున్న రుణం (వడ్డీతో కలుపుకుని 2 లక్షలు) మాత్రమే మాఫీ చేయనున్నారు. భార్యాభర్తల పేరిట వేర్వేరు భూములు ఉన్నట్లయితే ఇద్దరికి రుణ మాఫీ వర్తించనున్నదని తెలుస్తున్నది. బంగారు తనఖాపెట్టి తీసుకున్న రుణాలను ఎట్టి పరిస్థితుల్లో మాఫీ చేయరని తెలుస్తున్నది.

● 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష రూపాయల వరకు జిల్లాలో 330 కోట్ల రూపాయల వరకు రుణ మాఫీ చేసింది. రెండవ దఫా అధికారంలోకి వచ్చే ముందు కూడా మరోసారి రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ రుణాలను నాలుగు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని, అప్పటివరకు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను చెల్లించి కొత్తగా పంట రుణాలను తీసుకోవాలని ఆదేశించింది. 2018 డిసెంబరు 11 వరకు తీసుకున్న రుణాల లెక్కల ప్రకారం జిల్లాలో 93,642 మంది రైతులకు 501 కోట్ల 47 లక్షల రూపాయలు వర్తింపజేసింది. ఈ డబ్బులను 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు మూడు మాసాల ముందు నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చే నాటికి ప్రభుత్వం 58,041 మంది రైతులకు 315 కోట్ల 50 లక్షల 70 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేసింది. ఇంకా 35,601 మంది రైతులకు 185 కోట్ల 96 లక్షల 40వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. ఇందులో చాలామంది తమ రుణాలను రీషెడ్యూల్ చేసుకున్నారు.వారితో పాటు రీషెడ్యూల్ చేసుకోలేని వారికి రుణ మాఫీని వర్తింపజేయనున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం కటాఫ్ తేదీని 2018 డిసెంబరు 12వ తేదీని ప్రకటించింది. ప్రతి సీజన్‌లో వడ్డీ సొమ్ము చెల్లించి రుణాలను రెన్యూవల్ చేసుకోగా, మొత్తానికే వడ్డీ చెల్లించకుండా తిరిగి రుణాలు తీసుకోలేని వాళ్ల రుణాలు 100 కోట్ల రూపాయల లోపే ఉండవచ్చని బ్యాంకు అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 వేల కోట్ల రూపాయల వరకు రుణ మాఫీ కానున్నదని ప్రాథమికంగా ప్రభుత్వం అంచనా వేసింది. ఆ లెక్కన జిల్లాలో 800 నుంచి వెయ్యి కోట్ల రూపాయల వరకు పంట రుణాలు మాఫీ కావచ్చని అంచనా వేస్తున్నారు. ఒకేసారి 2 లక్షల రూపాయల వరకు రుణాలను మాఫీచేసే విధంగా కేబినెట్‌లో తీర్మానం చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

'ఆరుద్ర' ఆగమనం..



పెద్దపల్లి రూరల్, జూన్ 22: మృగశిర కార్తి ముగిసి శనివారంతో ఆరుద్ర కార్తి మొదలైంది. తొలకరి జల్లులు పడిన తర్వాత ఆరుద్ర కార్తిలో ఆరుద్ర పురుగులు దర్శనమిస్తుంటాయి. ఈ పురుగులు దుక్కులు దున్నిన చెలకల్లో, పచ్చిక బయళ్లలో కనబడి కనువిందు చేస్తుంటాయి. ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయంటే వర్షాలు బాగా కురుస్తాయనేది రైతుల నమ్మకం. పంట పొలాల్లో క్రిమిసంహారక మందుల వాడకం పెరిగిపోవడంతో భూముల్లో విష వాయువులు చేరిపోయి పంటలకు మేలుచేసే పురుగులు క్రమంగా అంతరించి పోతున్నాయి. అందులో ఆరుద్ర పురుగు ఒకటి. శనివారం పెద్దకల్వలలో ఆరుద్ర పురుగులు ప్రత్యక్షం కావడంతో రైతులు సంబర పడుతున్నారు.

సైలెన్సర్లు ఆల్ట్రేషన్ చేస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్



యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్

కోల్‌సిటీ, జూన్ 22: బైకులకు కొంత మంది సైలెన్సర్ తీసివేసి, ఆల్ట్రేషన్ చేసి భారీ శబ్దాలు చేస్తూ నడుపుతున్నారని, దీంతో రోడ్డుపై వెళ్లే వారు భయాందోళనకు గురవుతున్నారని రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఇందారంనకు చెందిన వెన్నంపల్లి స్వర్లేష్ గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం వైపు రాజీవ్ రహదారిపై బైక్ సైలెన్సర్ తీసివేసి పెద్ద శబ్ధంతో నడుపుతున్నాడని, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్నట్టు గుర్తించామన్నారు. తన స్నేహితులను ఎక్కించుకుని సరదాగా చక్కర్లు కొడుతున్నట్టు గమనించామని, శనివారం ట్రాఫిక్ పోలీసులు కాపుకాసి అతన్ని పట్టుకున్నట్టు సీఐ తెలిపారు. అతని తల్లిదండ్రులు, బంధువులను పిలిపించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించినట్టు సీఐ తెలిపారు. సైలెన్సర్ లేని, ఆల్ట్రేషన్ చేసిన బైక్‌లు నడిపేవారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

పాలకుర్తి, జూన్ 22: బసంత్‌నగర్ ఐఎంఎస్ పాఠశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం బసంత్‌నగర్ ఎస్‌ఐ కొమ్మెర శివాణిరెడ్డి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, కేశోరాం ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్లు ప్రార్థసారధి, త్రిపాఠి, ప్రిన్సిపాల్ మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష - పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెద్దపల్లి రూరల్, జూన్ 22 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న భూరిజిస్ట్రేషన్‌లు, అధికారుల పనితీరు, రికార్డులు, దరఖాస్తుదారుల సమస్యలు పరిష్కారం అవుతున్నాయో లేవో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి ద్వారా పెండింగ్ ఉన్న సక్సేషన్, మ్యూటేషన్, టీఎం 33 మాడ్యుల్ దరఖాస్తులు, జీఎల్‌ఎం మొదలగు దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వారి వెంట తహసీల్దార్ రాజ్‌కుమార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పెద్దపల్లి తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు

పెద్దపల్లిటౌన్, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ జిల్లాకేంద్రంలోని జడ్పీ ఉన్నత(బాలికలు) పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత(బాలురు) పాఠశాలను అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత(బాలికల)పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న ప్లేగ్రౌండ్, భోజనశాల, తదితర వివరాలు అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో స్టాఫ్ వివరాలు, విద్యార్థుల సంఖ్య తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పాఠశాల మైదానంలో స్టేజి కావాలని హెడ్మాస్టర్ కోరగా దానికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత(బాలుర) పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన టాయిలెట్స్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పాఠశాలలోని మైదానం స్లోప్‌గా ఉండేలా చర్యలు తీసుకొని వర్షపు నీరు ఆగకుండా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ పెండింగ్ ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధరణి ద్వారా పెండింగ్ ఉన్న సక్సేషన్, మ్యూటేషన్ మొదలగు దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మండల విద్యాశాఖ అధికారి బాలుర పాఠశాల హెడ్మాస్టర్ సురేందర్, బాలికల పాఠశాల హెడ్మాస్టర్ టి.అరుణ, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్‌పర్సన్ స్రవంతి, రజిని, మెప్మా డిఎంసి మౌనిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తే చర్యలు

- ఆర్డీవో హనుమా నాయక్

మంథని, జూన్ 22: డివిజన్‌లో ఎవరైనా అక్రమ ఇసుక, మట్టి రవాణాకు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంథని ఆర్డీవో హనుమానాయక్ హెచ్చరించారు. తమ కార్యాలయంలో డివిజన్‌లోని వివిధ మండలాల తహసీల్దార్లతో శనివారం ఆర్డీవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు వారి పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ పాసు పుస్తకం, ఆధార్ ప్రతులను 3రోజులలోగా సేకరించాలని సూచించారు. భూసేకరణలో ముంపునకు గురవుతున్న పైపులైన్లు, బావులు, బోర్లకు సంబంధించిన అంచనా విలువలు పూర్తిచేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు డి. రాజయ్య, బి. రాంచందర్‌రావు, పి. సుమన్, ఉద్యోగులు పాల్గొన్నారు.


రామగుండం కమిషనరేట్ పోలీసులకు సేవా పతకాలు



అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు



టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి



టూటౌన్ ఎస్ఐ కళాధర్‌రెడ్డి



వన్‌టౌన్ ఏఎస్ఐ స్వామి

కోల్‌సిటీ, జూన్ 22: తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి మహోన్నత సేవా, సేవా పతకాలను ప్రకటించింది. ఇందులో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజుకు తెలంగాణ స్టేట్ పోలీస్ మహోన్నత సేవ పతకం లభించింది. అలాగే రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ టీ మల్లారెడ్డికి, గోదావరిఖని టూటౌన్ ఎస్ఐ కళాధర్ రెడ్డికి, గోదావరిఖని వన్‌టౌన్ ఏఎస్ఐ డి స్వామి, రామగుండం కమిషనర్ సీపీఆర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆర్ల తిరుపతిలకు తెలంగాణ స్టేట్ సేవా పతకం లభించింది.

ధర్మారం మండలంలో కురిసిన వర్షం

ధర్మారం, జూన్ 22: ధర్మారం మండలంలో శనివారం తెల్లవారు జామున వర్షం కురిసింది. రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. వర్షం కురవడంతో రైతులు తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ బావుల్లోకి స్వల్పంగా నీరు చేరింది. వర్షంతో పంట పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే వ్యవసాయ పంట పొలాల సాగు మొదలుపెడుతామని రైతులు చెబుతున్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద

పెద్దపల్లిటౌన్, జూన్ 22: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద సూచించారు. శనివారం పెద్దపల్లి జిల్లా న్యాయాధికారుల సమీక్షా సమావేశానికి విచ్చేసిన హైకోర్టు జడ్జి జస్టిస్‌కు పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లకిడి భాస్కర్, జనరల్ సెక్రెటరీ కోటగిరి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన జడ్జి తరువాత కోర్టు ప్రాంగణంలో మొక్కను నాటారు. కోర్టు ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా వైద్యారోగ్య శాఖ సహకారంతో ఏర్పాటుచేసిన హెల్త్‌క్యాంపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి మాట్లాడుతూ మంచి ఆరోగ్యం ప్రతి మనిషికి అవసరమైన ప్రాథమిక అంశమని, మహాత్మాగాంధీ చెప్పినట్లు మనిషికి అసలైన సంపద మంచి ఆరోగ్యంగా ఉండటమేనని, బంగారం వెండి ఆభరణాలు కాదన్నారు. దేశ జనాభా ఆరోగ్య స్థితిగతులు ఆ దేశ అభివృద్ధిని సూచిస్తాయని, ఆరోగ్యవంతమైన ప్రజలు విద్య, ఉపాధి, అభివృద్ధి అంశాలలో ముందుంటారని అన్నారు. కరోనా మహమ్మారి అనంతరం ఆరోగ్యం ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి మరింత తెలిసిందన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్మాన్ భారత్ వంటి వివిధ కార్యక్రమాలను సైతం అమలుచేస్తున్నాయన్నారు. ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ వల్ల మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని వివరించారు. హైబీపీ, హైకొలెస్ట్రాల్ వల్ల కూడా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ నిర్వహించుకోవడం చాలా మంచిదని జడ్జి పేర్కొన్నారు. ఆసుపత్రికి ప్రజలు చాలా నమ్మకంతో తమ వ్యాధులను నయం చేస్తారని డాక్టర్లపై అమితమైన విశ్వాసంతో వస్తారని, సమాజంలో డాక్టర్లను దేవుళ్ల స్థాయిలో గౌరవిస్తారని జడ్జి తెలిపారు. వైద్యులు తమ విధులు నిర్వహించే సమయంలో ఎల్లప్పుడూ సేవా దృక్పథంతో ఉండాలని హైకోర్టు జడ్జి తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే అంశాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు ఏసీపీ జి. క్రిష్ణ, సీఐ క్రిష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్‌కుమార, ఇతర వైద్య అధికారులు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ ఏ.ఎన్.ఎంలు, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యులు ఈ.వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఛైర్మన్ రాజగోపాల్, వైస్‌ఛైర్మన్ తూము రవీందర్, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నంది పంప్‌హౌస్‌ను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ధర్మారం, జూన్ 22: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ధర్మారం మండలం నందిమేడారంలోగల నంది పంప్‌హౌస్‌ను శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద సందర్శించారు. మధ్యాహ్నం ఆమె నేరుగా అండర్‌టన్నెల్‌లోకి వెళ్లి కట్టిన కట్టడాలను పరిశీలించారు. అండర్ టన్నెల్‌లో నిర్మించిన ఏడు పంపు మోటార్లు, సర్జ్‌పూల్ ట్యాంక్, గ్యాస్ ఇన్సులేటర్ పరిశీలించారు. వాటి అవశ్యకత గూర్చి ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నుంచి అండర్ టన్నెల్ గుండా నంది పంప్‌హౌస్‌లోకి చేరుతుందని వివరించారు. సర్జ్‌పూల్ ట్యాంకులో ఏడు పంపు మోటార్ల ద్వారా 105మీటర్ల ఎత్తులోగల భూ ఉపరితలంపై కాళేశ్వరం ప్రాజెక్ట్ నీరు డెలివరీ సిస్టర్న్‌లో ఉప్పొంగుతుందని వారు విశదీకరించారు. ఇక్కడి గ్రావిటీ ద్వారా నంది రిజర్వాయర్‌లోకి చేరుకుని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో నిర్మించిన గాయత్రి పంప్‌హౌస్‌లోకి చేరుతుందని వివరించారు. ఇక్కడినుంచి కరీంనగర్ జిల్లా మిడ్ మానేరులోకి తరలింపు ప్రక్రియ చేస్తున్నట్టు చెప్పారు. వీటి నిర్మాణాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద సంతృప్తి చెందారు. ఆమె వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్, నందిమేడారం సివిల్ కోర్టు జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి, గోదావరిఖని జడ్జి వెంకటేష్ ధృవ, తహసీల్దార్ రజిత, కోర్టు సూపరింటెండెంట్ కొంరయ్య, తదితరులు ఉన్నారు.



నంది పంప్‌హౌస్‌ను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

సుల్తానాబాద్ కోర్టులో మొక్కలు నాటిన హైకోర్టు జడ్జి నంద

సుల్తానాబాద్, జూన్ 22: హైకోర్టు జడ్జి, పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేషన్ పోర్ట్‌పోలియో జడ్జి సూరపల్లి నంద శనివారం రాత్రి సుల్తానాబాద్ కోర్టులో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జికి న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు సిబ్బంది జడ్జికి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం జడ్జి పోలీసులతో గౌరవవందనం స్వీకరించారు. కోర్టులో జడ్జికి న్యాయవాదులు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా జడ్జి హేమంత్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జిలు వెంకటేష్, రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, న్యాయవాదులు లక్ష్మీరాజం యాదవ్, బాలకిషన్ ప్రసాద్, అంజనేయులు, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, వొడ్నాల రవీందర్, జోగుల రమేష్, శ్యామ్‌సుందర్, సరోత్తం రెడ్డి, భూమయ్య, అంజయ్య, అంజన్న, రాజేంద్ర ప్రసాద్, శివకృష్ణ, కరుణాకర్, నర్సయ్య, శ్యామ్, యుగందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆట



కన్నాపూర్‌లో కప్పతల్లి ఆడుతున్న గ్రామస్థులు

శంకరపట్నం, జూన్ 22: వరుణ దేవుడి కరుణ కోసం మండలంలోని మండలం కన్నాపూర్ గ్రామంలో రైతులు కప్పతల్లి ఆట ఆడారు. గత ఏడాది ఇప్పటికే విత్తనాలు వేశామని, నాట్లు కూడా కొంత మేర పూర్తి చేశామని మృగశిర కార్తి వెళ్లిపోతున్నా భారీ వర్షం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వర్షాలు సమృద్ధిగా పడాలని కప్పతల్లి ఆడుతు న్నామని గ్రామస్థులు తెలిపారు. రోకలి బండకు కప్పతల్లిని పసుపుగుడ్డలో కట్టి ఇంటింటికీ తిరిగారు. మహిళలు బిందెలతో నీరు పోస్తూ వరుణుడు కరుణించాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలోని గాయత్రి ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఆసుపత్రి భవనం రెండో అంతస్థులో ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఆసుపత్రి 2వ అంతస్థులో పేషెంట్లు ఎవరూ లేక పోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా నియంత్రించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 22: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 20మంది వాహనదారుల ను శనివారం కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురికి జైలుశిక్షతో పాటు 6 వేల రూపాయలు జరిమానా విధించారన్నారు. మిగతా 17 మందికి 29,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

హుజూరాబాద్, జూన్ 22: హుజూరాబాద్ డివిజన్‌లో ఎస్‌హెచ్‌వోకు దగ్గరగా మెదిలిన ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం తెలిసింది. హుజూ రాబాద్, జమ్మికుంట పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుళ్లు అవినాష్, పాషా, జమ్మికుంట రూరల్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే భాస్కర్‌రెడ్డిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల రోజులుగా హుజూరాబాద్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే ఆఫీసర్లకు అనుకూలంగా పని చేస్తున్నారని కానిస్టేబుళ్లపై సీపీ ఎస్‌బీ, ఇంటలీజెన్సీ విభాగాల ద్వారా సమాచారం సేకరించి బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

రెండో వివాహం చేసుకున్న ఒకరిపై కేసు

జమ్మికుంట రూరల్, జూన్ 22: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కొండు రవీందర్ రెండో వివాహం చేసుకున్నాడని మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందా పూర్‌కు చెందిన రవీందర్‌కు మంచిర్యాల జిల్లా నస్పూర్‌మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన లతతో 2009లో పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవీందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టుగా పని చేస్తున్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి గోవిందాపూర్‌లోనే ఉంటున్నారు. గడిచిన ఏడాది కాలం నుంచి దంపతుల మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది జనవరి 20న కరీంనగర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఫిబ్రవరి 18న గంగాధర మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సంగీత అనే మహిళను ఎల్ఎండీ కాలనీలోని నర్సింహాస్వామి ఆలయంలో రెండో వివాహం చేసుకున్నాడు. విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకొని తనను, పిల్లలను రోడ్డు మీద పడేసిన భర్తపై మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, జూన్ 22 సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ సదన్ కూమార్ శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 19 వేల నగదు, ఏడు మొబైల్ ఫోన్స్ ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిత్యం పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామని ఎవరైనా గ్యాంబ్లింగ్, బెట్టింగ్, పేకాట వంటి జూదాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు, డయల్ 100కి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మేడిపల్లి/భీమారం : మండల కేంద్రం శివారులో పేకాటరాయుళ్లను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడుల్లో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4.50 లక్షల నగదు, ఒక బైక్, ఒక కారు, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలిగేడు: జూలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాలపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.16.080 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం పట్టుబడ్డ నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లను జూలపల్లి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్, హెచ్‌సీలు శ్రీనివాస్, మహేందర్, కానిస్టేబుళ్లు శేఖర్, అఖిల్, మల్లేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు, కేటీఆర్.. రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలి

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 22: రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏకకాలంలో రైతులకు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేయబోతున్నామని ఇక హరీష్‌రావు, కేటీఆర్‌లు రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో కలిసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సీఎం నేతృత్వంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై జిల్లా రైతుల పక్షాన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల సమస్యలను పరిష్కరించి అండగా నిలిచి రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణ మాఫీ చేయబోతున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాలని కోరారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిందని మరోసారి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చినదని చేప్పేందుకు ఆరు గ్యారంటీ పథకాల అమలే నిదర్శనమన్నారు. హరీష్‌రావు మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 65 సీట్లతో సుస్థిరంగా ఉందని ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రెండు దశాబ్ధాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో


సమావేశంలో మాట్లాడుతున్న విప్, పాల్గొన్న ఎమ్మెల్సీ

ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగు కాబోతోందన్నారు. కొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారంటే వారి అవకాశ వాదానికి అది నిదర్శనమని చెప్పవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించడంతో పాటు పంటల పథకంలో రైతుకు సంబంధించిన ప్రీమియం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు సాగుచేసే సన్నరకాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 చెల్లిస్తామన్నారు. రైతు భరోసా విధి, విధానాల అమలుపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టబోతుందన్నారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జగిత్యాల క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్ తదితరులు ఉన్నారు.

రహదారి పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

కరీంనగర్ రూరల్, జూన్ 22: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల వాగు శివారులో గతంలో ప్రభుత్వం అటవీశాఖకు 17.34 గుంటల భూమిని కేటాయించింది. గత కొన్ని నెలల నుంచి ఇరుకుల్ల పరిధిలో జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారి పనులను చేపట్టారు. ఇరుకుల్ల వాగు శివారులో సమ్మక్క గద్దెల సమీపంలో నుంచి రహదారి నిర్మాణ పనులు నడుస్తుండగా అటవీ భూముల్లో దారి నిర్మిస్తున్నారంటూ అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. భూసేకరణ చేపట్టకుండానే తమ భూముల నుంచి రహదారి నిర్మిస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ, ఫారెస్టు, నేషనల్ హైవే అధికారుల సమక్షంలో అటవీభూములను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్సిపెక్టర్ సేవియా నాయక్ ఆధ్వర్యంలో అటవీ భూములను పరిశీలించి ప్రాథమిక సర్వే నిర్వహించారు. మరో సారి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తామని డీఐ సేవియా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఆర్ఐ వాస్తవిక్, సర్వేయర్లు సంతోష్, రాకేష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

జగిత్యాల టౌన్, జూన్ 22: ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో ఇద్దరిపై జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సారంగాపూర్ మండలం లక్ష్మిదేవిపల్లి, ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరి వ్యక్తులకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జగిత్యాలకు చెందిన ముఫీజ్ ఉల్ హక్, వరంగల్‌కు చెందిన ఇంతియాస్ అనే ఇద్దరు వ్యక్తులు రూ. 19 లక్షలు వసూలు చేశారు. రోజులు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని లక్ష్మిదేవి పల్లి గ్రామానికి చెందిన బాధితుడి తండ్రి శంకరయ్య శనివారం జగిత్యాలలో ఉన్న ముఫీజ్ ఇంటికి వెళ్లి నిలదీశాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు శంకరయ్యను కులం పేరుతో ముఫీజ్‌తో పాటు అతని భార్య దూషించారు. దీంతో శంకరయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మానకొండూర్‌లో అదృశ్యం.. కుమరం భీం జిల్లాలో హత్య

● కేసును ఛేదించిన పోలీసులు

మానకొండూర్, జూన్ 22: మానకొండూరులో అదృశ్యమైన యువకుడు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలో దారుణంగా హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. మానకొండూరు గ్రామానికి చెందిన అనంతోజు సాయికిరణ్(29) ఏప్రిల్ 18, 2024న భార్య అనూషతో సిద్దిపేటకు వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె మే 2న మానకొండూరు పోలీసు స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. నాలుగు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫాంలో అనంతోజు సాయికిరణ్ పనిచేస్తుండగా, దహెగాంకు చెందిన బట్టి సునీత, ఆమె భర్త శ్రీనివాస్ పరిచయమయ్యారు. సునీత, సాయికిరణ్‌తో సాన్నిహిత్యంగా ఉండడంతో ఇరు కుటుంబాల్లో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ భార్య అనూషతో కలిసి మానకొండూరుకు వచ్చి కర్ర మిషన్‌లో పనిచేస్తున్నాడు. సాయికిరణ్ ఏప్రిల్18, 2024న మళ్లీ కోళ్ల ఫాంకు వెళ్లగా సునీత, శ్రీనివాస్ దంపతులతో గొడవ జరిగింది. దీంతో సునీత, శ్రీనివాస్ అదే రోజు దహెగాంకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ ఏప్రిల్ 19, 2024న దహెగాంలోని సునీత, శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి సునీత కుటుంబ సభ్యులు తండ్రి తుమ్మిడి గంగారాం, మేనమామ భీంకరి శ్యాంరావుతో పాటు సునీత, శ్రీనివాస్ కర్రతో సాయి కిరణ్‌పై దాడిచేసి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని దహెగాంలోని హనుమాన్ ఆలయ సమీపంలోని పాడుబడ్డ బావిలో పడవేశారు. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ విచారణలో భాగంగా సునీత, శ్రీనివాస్‌ను విచారించగా హత్య విష యాన్ని అంగీకరించారు. శనివారం సాయికిరణ్ మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


సాయికిరణ్ (ఫైల్)

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

● సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

మల్లాపూర్, జూన్, 22: మల్లాపూర్ మండల కేంద్రంలోని శివారులో శనివారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సబ్‌స్టేషన్ ఎదుట మృతి చెందిన పాడి గేదెలను ఉంచి రైతులు ఆందోళన చేపట్టారు. ట్రాన్స్‌కో లైన్‌మన్ రవిజేతపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఏడీఏకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ శివారులోని గాంధీనగర్‌వాడ సమీపంలోని బర్ల మంద వద్ద ఉన్న విద్యుత్ స్తంభం తీగలు తెగిపడ్డాయని లైన్‌మన్‌కు నెల రోజులుగా కోరుతున్నామన్నారు. మరోవైపు తెగిపడిన విద్యుత్ తీగలకు కరెంటు సరఫరా అవుతుండటంతో ప్రమాదవశాత్తు రెండు పాడి గేదెలు మృతి చెందాయని తెలిపారు. తెగిన విద్యుత్ తీగలను సరిచేయకపోవడంతోనే రెండు పాడి గేదెలు మృతి చెందాయని ఫోన్ ద్వారా లైన్‌మన్ రవితేజకు తెలుపగా తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఏకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఒక్కో గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందజేసి న్యాయం


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు

చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ స్తంభం నేలకొరుగడంతో మందుల భూమయ్య చెందిన సీమ పంది విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 22వేలు నష్టం జరిగిందని తనకు న్యాయం చేయాలని విద్యుత్ అధికారులకు బాధితుడు వినతిపత్రం అందజేశారు.

దొంగ కోసం పోలీసుల గాలింపు

మల్యాల, జూన్ 22: వరుస దొంగతనాల కేసుల్లో నిందితుడైన ఓ దొంగను పట్టుకోవడానికి పోలీసులు శనివారం ఉదయం గాలింపు చేపట్టారు. మండలంలో ఇటీవల ఇళ్లల్లో దొంగతనాలు జరుగడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు శనివారం జగిత్యాల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెలుతున్న ఓ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నిస్తూ మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం వరకు అతన్ని వెంబడించారు. మల్యాల, కొడిమ్యాల పోలీసులు ద్విచక్రవాహనంపై దొంగను అనుసరించడంతో అతను గుర్తించి తన వాహనం వేగాన్ని మరింతగా పెంచి పారిపోయినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంలో దొంగ కోసం వెతికినా ప్రయోజనం లేకపోగా తృటిలో దొంగ తప్పిపోవడం, వెంటనే సెల్‌ఫోన్ ఆఫ్ చేయడంతో అతను వెళ్లిన మార్గం తెలియనట్లు సమాచారం. దొంగ తప్పించుకోవడంతో పోలీసులు గాలింపు మరింత పెంచినట్లు తెలిసింది.

ఒకరి ఆత్మహత్య


తిరుపతిరెడ్డి (ఫైల్)

వేములవాడరూరల్, జూన్ 22: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఎల్లాల తిరుపతిరెడ్డి (48) అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డి తండ్రి రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి మృతితో మతిస్థిమితం కోల్పోయిన తిరుపతిరెడ్డి రెండు నెలల నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తన పొలం వద్దకు వెళ్లి ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 22: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. జేష్ఠ శుద్ధ పూర్ణమితో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చన లు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రాత్రి వరకు భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి పాల్గొన్నారు.


ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం అర్థరాత్రి కురిసిన వర్షంకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ దాడులు

● స్టేషన్ బెయిల్ కోసం లంచం అడిగిన ఎస్సై ● మధ్యవర్తి అరెస్టు .. ఎస్సై పరారీ

రాయికల్, జూన్ 22: జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. స్టేషన్ బెయిల్ కోసం రాయికల్ ఎస్సై అజయ్ లంచం డిమాండ్ చేయడంతో పక్కా సమాచారంతో అధికారులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఏసీబీ అధికారుల రాకను పసిగట్టిన ఎస్సై తన ఇంటి ఆవరణలోని గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తిని అధికారులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి కథనం మేరకు.. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ఈ నెల 11న ఎస్సై తన సిబ్బందితో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై అదే రోజు కేసు నమోదు చేశారు. ఈ విషయమై స్టేషన్ బెయిల్ కోసం రాజేందర్‌రెడ్డి ఎస్సైని కలువగా రూ. 50 వేలు ఇస్తేనే బెయిల్ ఇస్తానని డిమాండ్ చేశాడు. చివరకు రూ.25 వేలకు ఒప్పందం కుదిరింది. అదే రోజు రూ. 15 వేలు అందజేసి మిగతా డబ్బులను తర్వాత ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం మిగతా డబ్బులు ఎస్సైకి ఇచ్చేందుకు పథకం రూపొందించారు. ఏసీబీ అధికారులతో కలిసి బాధితుడు రూ.10 వేలు ఇచ్చేందుకు ఎస్సైని సంప్రదించగా మధ్యవర్తి పుల్లూరి రాజును కలిసి డబ్బులు ఇవ్వాలని వారికి సూచించాడు. దీంతో రాజేందర్‌రెడ్డి మధ్యవర్తి రాజుకు డబ్బులు ఇచ్చి ఇద్దరూ కలిసి రాత్రి 10 గంటల సమయంలో


రాయికల్ పోలీస్‌స్టేషన్


రాజు అరెస్టును చూపుతున్న ఏసీబీ అధికారులు

ఎస్సైకి డబ్బులు ఇచ్చేందుకు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్సై లేకపోవడంతో డబ్బులు తెచ్చామని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్సైకి ఏసీబీ అధికారుల వాహనాలు కనబడడంతో స్టేషన్‌లోని క్వార్టర్స్ గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తి రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఎస్సై కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, జూన్ 22: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. వైష్ణవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ముగ్గురు, ట్రినిటీ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ధర్మపురిలో ఒకరు డీబార్ అయ్యారన్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన మహిళ

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల డబ్బులు దొంగిలిస్తున్న ఒక మహిళను శనివారం ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన జ్యోతి అనే మహిళ 16వ ప్లాట్‌ఫాం వద్ద హుజూరాబాద్‌కు చెందిన అనూష పర్సులో నుంచి నగదు, ఏటీఎం కార్డును, మంచిర్యాలకు చెందిన సరళ బ్యాగ్ నుంచి 3 వేల రూపాయలు దొంగిలిస్తుండగా పట్టుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 22 : నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్లు గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన దండుగుల సురేష్ అనే వ్యక్తి మండల పరిధిలోని కోళ్లమద్ది గ్రామానికి చెందిన చీకోటి స్వామిని గల్ఫ్ దేశానికి పంపిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేశాడని తెలిపారు. ఒరిజనల్ పాస్‌పోర్టు, 10 వేల నగదును సురేష్ తమ వద్ద తీసుకున్నాడని బాధితుడు స్వామి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ వెల్లడించారు. సురేష్‌ను శనివారం అరెస్ట్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. స్వామి వద్ద 8 ఒరిజినల్ పాస్‌పోర్టులు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

మూలవాగులో మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జూన్ 22: వేములవాడ మూలవాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మల్లారం రోడ్డులో గల మూలవాగు ఇసుక రీచ్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తిగా గుర్తిం చారు. మృతుడు బ్లాక్ ప్యాంట్, తెల్లటి షర్ట్ ధరించి ఉన్నాడని, మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదన్నారు. అనుమానాస్పదంగా ఉన్నవారు వేములవాడ పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

జగిత్యాల టౌన్,జూన్ 22: తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తిని గిఫ్ట్‌డీడ్ చేసుకున్న ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బుగ్గారం మండలం శేఖల్ల గ్రామానికి చెందిన ఠాకూర్ గణేష్ సింగ్‌తో పాటు అతని ముగ్గురి సోదరులకు జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో వారసత్వంగా వచ్చిన ఆస్తి ఉంది. గణేష్ సింగ్ సోదరుడు కిసాన్ సింగ్ తప్పుడు పత్రాలు సృష్టించి ఉమ్మడి ఆస్తిని తన భార్య పేరుమీదికి మార్చి ముగ్గురు సోదరులను మోసం చేశాడు. గణేష్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కిసాన్ సింగ్‌పై కేసు నమోదు చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, జూన్ 22: మండలంలోని తక్కళ్లపల్లి శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. గొల్లపల్లి మండలం గుంజపడుగు చెందిన గందం చందు అనే వ్యక్తి టాటా ఏస్ గూడ్స్ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకొని 13క్వింటాళ్ల బియ్యం, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చందుపై సుమోటో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్

పెద్దపల్లి రూరల్, జూన్ 22: వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్‌రాథోడ్ అన్నారు. శనివారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత పనులను చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని సూచించారు. అలాగే హరితహారం కార్యాక్రమం విజయవంతం చేసేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధి పనికి వచ్చిన ప్రతి కూలీ మస్టర్ నమోదును పకడ్బందీగా నిర్వహించాలని, ఉపాధిహామీ పథకంలో ఉన్న వాటిని అర్హులైనా వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ సత్యనారాయణతో పాటు ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, జేఈలు, గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

-జడ్పీ సీఈవో నరేందర్

పెద్దపల్లి రూరల్, జూన్ 22 : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పెద్దపల్లి జడ్పీ సీఈవో నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో కొన్ని రోజులుగా జ్వరాలు వస్తున్న నేపథ్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జడ్పీ సీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో మాట్లాడుతూ వానాకాలం వస్తున్న దృష్ట్యా పారిశుద్ధ్యం, పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది సైతం జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. వారి వెంట ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్ గౌడ్, ఎంపీవో సుదర్శన్, మాజీ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పాలకుర్తి, జూన్ 22: పాలకుర్తి మండలం పరిధిలోని కుక్కలగూడూర్ తదితర గ్రామాల్లో శనివారం రైతులకు పంటల సాగుపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం పలు విత్తన డీలర్ల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆదిరెడ్డి మాట్లాడుతూ విత్తన డీలర్లు అందరూ తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. నిలువ సూచిక బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని, రిజిష్టర్‌లను సరిగ్గా నిర్వహించాలని డీలర్లకు నిబంధనలు జారీ చేశారు. పంటల నమోదులో భాగంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఆదిరెడ్డి వెంట ఏఈవోలు సుష్మ, యోజనలు ఉన్నారు.

25న క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధర్మారం, జూన్22: ధర్మారం మండల విద్యావనరుల కేంద్రంలో ఈ నెల 25న మండల స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపీక ప్రక్రియ నిర్వహించనున్నట్టు మండల విద్యాధికారి పి.ఛాయాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రభుత్వామోధిత పాఠశాలలో 4వతరగతి చదువుతున్న విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ నిర్వహించబడునని ఆమె పేర్కొన్నారు. క్రీడా పోటీలకు హాజరయ్యే విద్యార్థులు మూడో తరగతి పూర్తి ఉండాలని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న స్టడీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌లతో పాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని ఆమె సూచించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

కళ్యాణ్‌నగర్, జూన్ 22: రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 30మంది నిరుపేద వృద్ధులకు శనివారం ఉచిత కంటి ఆపరేషన్లు అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి చేయించారు. రేకుర్తిలోని కంటి ఆసుపత్రికి 30మందిని వ్యాన్‌లో తీసుకెళ్లి ఉచిత ఆపరేషన్లు చేయించారు. అనంతరం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు అయిన తరువాత డాక్టర్లు సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు మేడిశెట్టి గంగాధర్, తానిపర్తి గోపాల్‌రావు, తిలక్‌చక్రవర్తి, రంగమ్మ పాల్గొన్నారు.

గో కల్యాణం

ఓదెల, జూన్22: ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని మడకలో శనివారం తొలిసారిగా గోరక్షకులు మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య ఆధ్వర్యంలో గో కళ్యాణాన్ని నిర్వహించారు. ఆవుల వల్ల కలిగే ప్రయోజనాలను తహసీల్దార్ తూము రవీందర్, జిల్లా గోసేవ ప్రముఖ్ మల్లేశంలు వివరించారు. మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, సదయ్య, వైద్యుడు ఏంబాడి మల్లేష్, నోముల సాగర్‌రెడ్డి, గోషిక రాజేశం, పుట్టసదయ్య తదితరులు పాల్గొన్నారు.

'పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి'

పెద్దపల్లిటౌన్, జూన్ 22: మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబంపై మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీపాద రావు దయాదాక్షిణ్యాలతో రాజకీయంగా ఎదిగిన పుట్ట మధుకు కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని నిలదీశారు. అవినీతికి కేరాఫ్ గా ఉన్న పుట్ట మధుకు దుద్దిల్ల కుటుంబం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కాళేశ్వరం ఎస్సైగా ఉన్న వ్యక్తి చర్యలకు కాంగ్రెస్ నాయకులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇకపై మంత్రి కుటుంబంపై అసత్య ఆరోపణలు చెస్తే ఊరుకునేది లేదని నాయకులు కాశిపాక ప్రశాంత్, కాంపెల్లి సతీష్, కల్వల సాగర్, ముష్క ప్రవీణ్, వేమన, రంజిత్, శంకర్, నర్సన్న హెచ్చరించారు.

26న జాబ్ మేళా

పెద్దపల్లిటౌన్, జూన్ 22: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్ హైదరాబాద్ కంపెనీ ద్వారా పెద్దపల్లి జిల్లాలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 26న ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్ కంపెనీ నందు 26 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 60 ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, 2 హెచ్‌ఆర్, ఒకటి ఆఫీస్ బాయ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లకు డిగ్రీ, డిప్లమా, ఫీల్డ్ డెవలప్‌మెంట్ అధికారికి అగ్రికల్చర్ బీఎస్సీ, హెచ్‌ఆర్‌లకు మార్కెటింగ్ ఎంబీఏ, ఆఫీస్ బాయ్‌కి పదవ తరగతి పైన విద్యార్హతలు ఉండాలన్నారు. ప్రతి పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 40 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మిగిలిన పోస్టులకు పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, సంబంధిత విద్యార్హత కలిగిన వారు జూన్ 26 న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ కొరకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9885824326, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యా బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 22:మండలంలోని మల్యాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు విద్యను బోధించుటకు అర్హులైన విద్యావంతులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జీ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ కామర్స్ సబ్జెక్ట్, 9, 10 తరగతులకు సాంఘిక శాస్త్రం గంటల ప్రాతిపదికన బోధించుటకు హెచ్‌బీటీ టీచర్ పోస్ట్ ఒకటికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24న పాఠశాలలో జరిగే డెమోకు క్లాసులకు హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 9912287417లో సంప్రదిం చాలని కోరారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల అహ్వానం

సుల్తానాబాద్, జూన్ 22: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోడల్ స్కూల్‌లో ఆరు, ఏడు,ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతుల్లో పలు సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఈనెల 30లోగా దరఖాస్తులను స్కూల్‌లో అందజేయవచ్చని పేర్కొన్నారు.

నిరుపేద పద్మశాలి కుటుంబానికి చేయూత

ఎలిగేడు, జూన్ 22 : మండలంలోని నర్సాపూర్ గ్రామ కుర్మ రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పెద్దపల్లి జిల్లా పద్మశాలి సేవాసంఘం అడక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50కిలోల బియ్యాన్ని అందించారు. శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కమిటీ సభ్యులు మామిడాల రమేష్, పెగడ చందు, సుంక మహేష్, పోరండ్ల భాస్కర్ పాల్గొన్నారు.

రేపు కూరగాయల వార సంత వేలం

ధర్మారం, జూన్ 22: మండల కేంద్రంలో ప్రతి మంగళ వారం జరిగే కూరగాయాల వార సంతకు రేపు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్టు పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలు మండల పంచాయతీ అధికారి, ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో జరుగుతాయని ఆయన వివరించారు. పాల్గొనాలనుకునే వారు రూ.50వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

కుమ్మరికుంటలో..

జూలపల్లి, జూన్ 22: మండలంలోని కుమ్మరికుంట వార సంత వేలం ఈనెల 24న నిర్వహించడం జరుగుతుందని గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఆసక్తి గలవారు దావత్ సొమ్ము చెల్లించి పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

పెద్దపల్లి రూరల్, జూన్ 22 : మండలంలోని పెద్దబొంకూర్ అంగన్ వాడి కేంద్రంలో శనివారం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా వైద్యులు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫార్మసిస్ట్ దివ్యశృతి,ఏఎన్ఎం రాణి, అంగన్‌వాడి టీచర్ శంకరమ్మ పాల్గొన్నారు.

కళాభవన్‌కు నిధులు మంజూరు చేయాలి

కాల్వశ్రీరాంపూర్, జూన్ 22: మండల కేంద్రంలో కళాభవనానికి నిధులు మంజూరుచేయాలని కోరుతూ కళాకారులు శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు ఎండీ రజాక్, పాల శంకర్, బండెల సంపత్ పాల్గొన్నారు

సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు సమర్పించాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 22: సివిల్స్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ 2025 పరీక్షకు ఉచిత శిక్షణకు జూలై 3లోగా దరఖాస్తు సమర్పించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం జులై 3లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోచింగ్ తరగతులు జూలై 18 నుంచి 2025 ఏప్రిల్ 18వరకు కొనసాగుతాయని, మొత్తం 150మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని, జూన్ 22: అద్దె ఇంట్లో ఉంటూ ఆఖరి మజిలీకి అష్టకష్టాలుపడే పేదోడికి పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన ముక్తి ఆశ్రమం భరోసా ఇస్తుందని జడ్పీ చైర్మన్ పుట్ట మధు వెల్లడించారు. ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను పుట్ట మధు శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ.. మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన ఓరగంటి రాజేష్ మంథనిలో కిరాయి ఇంట్లో ఉంటూ మృతి చెందగా కర్మకాండలు నిర్వహించడానికి ఇంటి ఓనర్ ఒప్పుకోకపోవడంతో తమ పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించి ముక్తిఆశ్రమంలో కర్మకాండలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. పేదోడి ఆఖరి మజిలీలో ఇబ్బందులు రాకూడనే ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు స్పష్టం చేశారు.

షాపుల్లో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

మంథని, జూన్ 22: పట్టణంలో పలు షాపుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ కాంటాలను పరిశీలించి స్టాంపులేనివి, తూకాలు సరిగా లేనివి కాంటాలు సీజ్‌చేసి ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. వీరిపై రూ.31500 ఫైన్ వేసినట్లు లీగల్ మెట్రాలజీ అధికారి జిల్లా అధికారి విశ్వేశ్వర్ తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఒకేసారి రుణమాఫీ - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ - కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

గోదావరిఖని, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఏక కాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తుందని, మాటకు కట్టుబడి నిలబెట్టుకునేది కాంగ్రెస్ పార్టీ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ అమలుకు క్యాబినెట్ తీర్మాణం చేసిన సందర్భంగా శనివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో స్వీట్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పని తీరును అన్నీ వర్గాల ప్రజలు ఆమోదిస్తున్నారన్నారు. ప్రతి పక్షాలు దురుద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని హితవు పలికారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పరిపాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, సుతారి లక్ష్మణ్‌బాబు, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, ముస్తాఫా, నాయకులు కౌటం సతీష్, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, దాసరి ఉమాసాంబమూర్తి, బొమ్మక రాజేష్,సింహాచలం, చుక్కల శ్రీనివాస్, మీసాల సతీష్, ఆడెపు రవి, గుండేటి రాజేష్, శంకర్, నాజీ మోద్దీన్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, జూన్ 22: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ సభలో వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం రుణమాఫీకి శ్రీకారం చుట్టారన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని రైతులకు పంటల బీమా పథకం ఈ ప్రభుత్వం అమలు చేయబోతుందన్నారు. రైతుల రుణమాఫీ పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు అల్లం దేవేందర్, బంగారు రమేష్, సబ్బని రాజమల్లు, మాదాసు సతీష్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 37 కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.37,40,292 చెక్కులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే విజయ రమణారావుకు ఎంపీపీ నూనేటి సంపత్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఎంపీవో గోవర్ధన్,వైస్ఎంపీపీ జూకంటి శిరీష, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ ఎండీ ఇబ్రహీం, మాజీ జడ్‌పీటీసీ లంక సదయ్య, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి, జూన్ 22: రుణమాఫీకి మంత్రివర్గం ఆమోదం తెలపడంతో శనివారం మండల కాంగ్రెస్ నాయకులు బసంత్‌నగర్ బస్టాండు వద్ద సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారం, జూన్ 22: రైతు రుణమాఫీకి మంత్రివర్గం ఆమోదం తెలుపడంతో మండల కేంద్రంలోని అడవిశ్రీరాంపూర్ చైరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో బానసంచా పేల్చి సంబరాలు జరిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



బసంత్‌నగర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

చెరువు మట్టి తరలింపుపై వివాదం

- ఇరువర్గాలతో వర్గాల మధ్య తోపులాట..



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఎస్ఐ ఓంకార్‌యాదవ్

కాల్వశ్రీరాంపూర్, జూన్ 22: మండలంలోని గంగారంలో కోనాలకుంట చెరువు నుంచి ముదిరాజ్ కులస్తులు మట్టి తీసేందుకు ప్రయత్నించగా ఉషన్నపల్లి గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఉషన్నపల్లి గ్రామానికి చెందిన పశువులు, గొర్రెలు గంగారం గ్రామానికి రావద్దంటూ గంగారం ముదిరాజ్ సంఘం కులస్థులు పశువులను అడ్డుకోవడంతో ఉషన్నపల్లి గ్రామస్థులు కాల్వశ్రీరాంపూర్-సుల్తానాబాద్ ప్రధానరహదారిపై పశువులను రహదారిపై ఉంచి రాస్తారోకో చేపట్టారు. సంఘటన స్థలానికి కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్ చేరుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పి శాంతింపచేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

మట్టి తరలింపుపై ఆగ్రహించిన గ్రామస్థులు

ఎలిగేడు, జూన్ 22 : మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి(రాములపల్లి) గ్రామంలోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకొని ధ్వంసం చేశారు. కొన్ని నెలలుగా వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి అక్రమార్కులు లక్షలు గడించారని గ్రామస్థులు ఆరోపించారు. అక్రమ మట్టి తరలింపుపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం వల్ల ఆగ్రహించిన గ్రామస్థులు దాడి చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

జూలపల్లి, జూన్ 22 : కేంద్ర హోంశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి కరీంనగర్ వచ్చిన బండి సంజయ్‌ను జూలపల్లి బీజేపీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, సీనియర్ నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, తానే అశోక్, ఉపాధ్యక్షుడు పొన్నం వెంకటేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు సంగెం వేణుగోపాల్, మండల కార్యదర్శి ఆవుల రాజు, గణవేన అజయ్ పాల్గొన్నారు.

రైళ్ల హోల్టింగ్‌కు కేంద్ర మంత్రికి వినతి

ఓదెల, జూన్ 22: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, తిరుమల-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను హాల్టింగ్ చేయించాలని శుక్రవారం కరీంనగర్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రాన్ని సమర్పించారు. కొలనూర్ రైల్వేస్టేషన్ నుంచి నిత్యం ఇతర మండలాల నుంచి రైళ్ల ద్వారా ప్రయాణం కొనసాగిస్తారని ఈ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బండి సంజయ్‌ను బీజేపీ నాయకులు కొల్లూరి కుమార్, మిత్ర బృందం సన్మానించారు.

పాలీసెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

కోల్‌సిటీటౌన్, జూన్ 22: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో శనివారం పాలీసెట్-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. ఈసందర్భంగా పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్‌కుమార్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థులు వారి పాలీసెట్ ర్యాంక్ కార్డు, పదవతరగతి మెమో, స్టడీ సర్టిఫికేట్(నాల్గవ తరగతి నుంచి పదవ తరగతి వరకు), కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ సర్టిఫికెట్(1-1-2024 తర్వాత) పదో తరగతి టీసీ, ఆధార్‌కార్డు, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్‌ల జిరాక్స్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్, కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కళ్యాణ్‌నగర్, జూన్ 22: కాంగ్రెస్ పార్టీ 6వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం 20మంది యువకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వంగ వీరస్వామి, సదానందం, గోవర్ధనశాస్త్రి, నాగేశ్వర్‌రావు, ఓదెలు, రాజేందర్, గట్టయ్య ఉన్నారు.



వీకేపీ గనిని సందర్శించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 22: వకీల్‌పల్లె గనిని శనివారం ఐఎన్‌టీయూసీ బృందం సందర్శించింది. ఈసంద్భంగా కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గని ఆవరణలో సదుపాయాల కల్పన, కార్మికులు ప్రస్తావించిన సమస్యలపై మేనేజర్‌తో చర్చించారు. గని స్థాయిలో పరిష్కారం అయ్యేవాటిని చేయాలని, ఇతర సమస్యలపై జీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. గురువారం రాత్రి కాంట్రాక్టు కార్మికుడు మరణించిన విషయమై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్టు కార్మికుడికి కాంట్రాక్టర్ ద్వారా రావాల్సిన పరిహారం ఇప్పిచేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గనిలో పర్యటించిన వారిలో ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, జగదీష్, బాబూరావు, రాజమౌళి, అంజయ్య, ఉమేష్, రాంచంద్రారెడ్డి ఉన్నారు.

సెక్యూరిటీ గార్డు కుటుంబానికి చేయూత

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 22: తమతో పనిచేస్తూ మరణించిన సెక్యూరిటీ గార్డు కుటుంబానికి చేయూత నిచ్చేలా ఆర్థికసాయం అందజేశారు. ఆర్జీ-2 ఎస్ అండ్‌పీసీ సిబ్బంది. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కొంకటి అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి తమవంతు చేయూతనివ్వాలని భావించిన తోటి సెక్యూరిటీ గార్డులు రూ.లక్ష సమకూర్చారు. శనివారం ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ చేతుల మీదుగా అంజయ్య కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. కంపెనీ ద్వారా రావాల్సిన బెనిఫిట్స్ వీలైనంత త్వరగా వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎస్ఓ వెంట సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రాజలింగం, యాదగిరితోపాటు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 22: ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లె గనిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుడు జనగామ శర్మ(32) మృతిచెందాడు. శుక్రవారం గనిలో వెల్డింగ్ పనులు చేస్తుండగా అస్వస్థతకు గురై కుప్పకూలాడు. స్థానిక డిస్పెన్సరీకి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో శర్మ మృతిచెందాడు. సుందిల్ల గ్రామానికి చెందిన శర్మకు భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యా సంస్థల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

- విద్యా సంస్థల పనితీరు సమీక్షలో సీఎండీ బలరాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, జూన్ 22: సింగరేణి విద్యా సంస్థలను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్టు సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆర్జీ-1 ఏరియాలో సెక్టార్-3 పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను త్వరలోనే ప్రవేశపెట్టనున్నటు ప్రకటించారు. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న 9 పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కాలేజీ, పీజీ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాలల పనితీరుపై సీఎండీ శనివారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని పాఠశాలల్లో గత ఏడాది సాధించిన 10వ తరగతి ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన సెక్టర్-3 పాఠశాల, భూపాలపల్లి పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. మిగిలిన పాఠశాలలు కూడా విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకోవాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. సింగరేణి విద్యా సంస్థల్లో దాదాపు 7500 మంది విద్యనభ్యసిస్తున్నారని, గత ఏడాది 94శాతం ఫలితాలు సాధించినట్లు జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్ వివరించారు. సింగరేణి విద్యాసంస్థలను దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లపై ఉందని, అందరూ సమన్వయంతో పనిచేయాలని సీఎండీ సూచించారు. పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని, ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునికీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పవిత్రమైన విద్యా సంస్థల్లో పని చేస్తున్న వాళ్లు మరింత అంకిత భావంతో పని చేయాలని, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని, క్రీడాసక్తిని కూడా పెంపొందించేలా బోధన సాగాలన్నారు. సింగరేణి విద్యా సంస్థల్లో ఇతరుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ సమీక్షలో సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్, జీఎం(కోఆర్డినేషన్) జీ దేవేందర్, జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్, అన్ని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

సైబర్ నేరాలపై కార్మికులకు అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 22: సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఓసీపీ-3 కార్మికులకు అవగాహన కల్పించారు. శనివారం కృషి భవన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సైబర్ నేరాల తీరును, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కార్మికులకు వివరించారు. క్రెడిట్ కార్డు సంబంధిత, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, అడ్వర్టయిజింగ్ మోసాలు, ఫ్రాడ్ లోన్ యాప్, ఓటీపీ వంటి మోసాలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం మొబైల్ వినియోగం పెరగడంతో వివిధ రకాల మోసాలు జరుగుతున్నట్టు తెలిపారు. అనుమానిత ఫోన్ కాల్స్, మెజేస్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి కార్మికులకు సూచించారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేష్, కుమార్, డీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.